క్లుప్తంగా

ఇంజినీరింగ్ విద్యార్థికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

సంతబొమ్మాళి: మండలంలోని బడే కుప్పన్న పేటకు చెందిన కేపీ స్పందన ఫౌండేషన్ సంస్థ తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి ఇజ్జిన జోషికుమార్‌కు శనివారం ఆర్థిక సహాయం అందించారు. జోషి టెక్కలి ఐతం కాలేజీలో ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. కాలేజీ ఫీజు బకాయి, ఉద్యోగ శిక్షణకు రూ.13వేలు సాయం చేయాలని సోషల్ మీడియా ద్వారా విన్నవించగా కె.పి. స్పందన ఫౌండేషన్ స్పందించి హాస్టల్‌కి వెళ్లి నగదు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు షణ్ముఖరావు, సురేష్‌రెడ్డి, సిమ్మన్న, చందు తదితరులు పాల్గొన్నారు.

31 మంది ప్రత్యేకావసరాల పిల్లలు గుర్తింపు


పిల్లలను గుర్తిస్తున్న భవిత సిబ్బంది

సోంపేట: మండలంలో పాత్రకొండ, పాలవలస, కర్తలిపాలెం, కొర్లాం గ్రామాల్లో సర్వే చేపట్టి 31 మంది ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించినట్లు భవిత కేంద్రాల సిబ్బంది శ్రీను, రమేష్ శనివారం తెలిపారు. విద్యార్థులందరికీ ఉచితంగా పరికరాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. భవిత కేంద్రాల్లో విద్య, ఫిజియోథెరపీ వంటి సేవలు అందించనున్నట్లు చెప్పారు. ప్రత్యేక అవసరాల పిల్లల తల్లిదండ్రులు భవిత కేంద్రాల సేవలను వినియోగించుకోవాలని కోరారు.

సజావుగా పెన్షన్ల పంపిణీ


బిగొనపపుట్టుగలో పెన్షన్ల పంపిణీ పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి

కవిటి: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న వివిధ రకాల పెన్షన్ల పంపిణీ కవిటి మండలంలో శనివారం నాటికి 92.5 శాతం పూర్తయిందని ఎంపీడీఓ కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. జగతి, బిగొనపపుట్టుగ పంచాయతీల్లో జరుగుతున్న పింఛన్ల పంపిణీని క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. బ్యాంక్ ఖాతాల్లో జమ అయిన లబ్ధిదారులు వారి ఖాతాలను పరిశీలించుకోవాలని సూచించారు.

తెలుగు భాషపై పట్టు సాధించాలి


తెలుగు వ్యాకరణం బోధిస్తున్న కృష్ణారావు

శ్రీకాకుళం అర్బన్: మాతృభాష తెలుగుపై విద్యార్థులు పూర్తిస్థాయిలో పట్టు సాధించాలని తెలుగు పండిట్ కృష్ణారావు అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా తెలుగు పండిట్ కృష్ణారావు తెలుగు వ్యాకరణంలో భాషాభాగాలు గురించి విద్యార్థులకు బోధించారు. కార్యక్రమంలో కేంద్ర గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ భాస్కరరాజా, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

శ్రీకాకుళం అర్బన్: బలగ హడ్కో కాలనీలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం లైబ్రేరియన్ పి.ఉగ్రసేను ఆధ్వర్యంలో పిల్లలకు ముందుగా నీతి కథలు, పద్యాలు చెప్పారు. అనంతరం క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. 9వ తరగతి విద్యార్థిని మేఘన, 7వ తరగతి విద్యార్థి జోగేంద్ర సాయి, 8వ తరగతి విద్యార్థి నిఖిల్ సాయి తొలి మూడు స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు కె.అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

చెట్లకొమ్మల తొలగింపు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని కార్పొరేషన్ పరిధిలో ఉన్న చెట్లతో ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ తమీమ్ అన్సారియా అన్నారు. శ్రీకాకుళం నగరంలోని పలు కాలనీల్లో ప్రమాదకరంగా ఉన్న చెట్టుకొమ్మలను తొలగించే పనులను శనివారం పరిశీలించారు. తుపాన్లు, ఈదురు గాలులు వేసి చెట్టు కొమ్మలు పడి విద్యుత్ సమస్య లేకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కమిషనర్‌తో పాటు అసిస్టెంట్ కమిషనర్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరామదూతం శిరసా నమామి


కవిటి:బల్లిపుట్టుగలో హనుమజ్జయంతి వేడుకలు


సంతబొమ్మాళి: హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

హనుమాన్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే వివిధ గ్రామాల్లో ఆంజనేయ ఆలయాలు, రామాలయాల్లో దీపారాధనలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఏకాహం భజన కాలక్షేపాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఆంజనేయస్వామి విగ్రహాలకు వడమాలలు, నిమ్మకాయల దండలు, తమలపాకులతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


కవిటి:ప్రగడపుట్టుగలో సామూహిక ఆంజనేయవ్రతాలు


కవిటి:కవిటికొత్తూరులో పూజలందుకుంటున్న అభయాంజనేయస్వామి


టెక్కలి: వంశధార కాలనీ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచిలో హనుమజ్జయంతి వేడుకల్లో భక్తులు


సోంపేట: పలాసపురంలో పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి


సోంపేట: బెంకిలిలో పూజలందుకుంటున్న ఆంజనేయుడు


ఇచ్ఛాపురం: కోదండరామాలయంలో పూజలందుకున్న హనుమాన్


ఇచ్ఛాపురం: బెల్లుపడ శివానందగిరిపై హనుమాన్


వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లిలో అన్నదానం నిర్వహిస్తున్న భక్తులు


ఇచ్ఛాపురం రూరల్: 108 తమలపాకులతో స్వామివారికి అర్చన


కాశీబుగ్గ: లేబరుకాలనీలో ఆంజనేయస్వామి


కాశీబుగ్గ: పలాసలో పూజలందుకుంటున్న హనుమాన్


ఇచ్ఛాపురం రూరల్: కేదారిపురంలో హనుమాన్ జయంతి వేడుకలు

ఏజెంట్లు అప్రమత్తంగా వ్యవహరించాలి


పార్లమెంట్ పరిధిలోని ఏజెంట్లకు సూచనలిస్తున్న పేరాడ తిలక్

- వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్

నందిగాం: కౌంటింగ్ కేంద్రంలో ఏజెంట్లు అప్రమత్తంగా వ్యవహరించాలని వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ సూచించారు. నందిగాంలోని సీతారామ కల్యాణ మండపంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో పార్లమెంట్ స్థానం ఏజెంట్లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాల్లో ఏజెంట్లు అప్రమత్తంగా ఉంటూ ఎలక్షన్ కమిషన్ చేసిన సూచనలకు అనుగుణంగా వ్యవహరించాలన్నారు. ఏవైనా అనుమానాలు ఉంటే జనరల్ ఏజెంట్ దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతాడ రవికుమార్ మాట్లాడుతూ కేంద్రంలో చేయాల్సిన బాధ్యతలను వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తమిరె ఫల్గుణరావు, జేసీఎస్ కన్వీనర్ జద్యాడ జయరాం, నాయకులు కురమాన బాలకృష్ణారావు, యర్ర చక్రవర్తి, కణితి నారాయణమూర్తి, పోలాకి మోహనరావు, హేమసుందరరాజు, అన్నెపు రామారావు, వెంకటరావు, ఆరంగి లక్ష్మీపతి, అట్టాడ శ్రీనివాసరావు, అంబోడి విష్ణు, చిన్ని జోగారావు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై వరి విత్తనాలు

కోటబొమ్మాళి: మండలంలోని 38 పంచాయతీల పరిధిలో రైతులు రాయితీపై వరి విత్తనాలు పొందేందుకు సోమవారం నుంచి రైతు భరోసా కేంద్రాల్లో ముందస్తుగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయాధికారి ఎస్. గోవిందరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీపీటీ 5204 (సాం రకం 25 కేజీల ప్యాకెట్లు), ఎంటీయూ 7029 (స్వర్ణ రకం), 1224, 1121, 1061 (30 కేజీల ప్యాకెట్లు) అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

ఆర్‌బీకేల్లో పచ్చిరొట్ట విత్తనాలు

ఇచ్ఛాపురం రూరల్: మండలం, మున్సిపాలిటీ పరిధిలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి భార్గవిరెడ్డి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ప్రస్తుతానికి జనుము విత్తనాలు 8 క్వింటాళ్లు, జీలుగ విత్తనాలు 36 క్వింటాళ్లు ఉన్నాయని, 10 కేజీల బ్యాగు రూ.450లకు విక్రయిస్తున్న నేపథ్యంలో రైతులు సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయాధికారిని సంప్రదించాలని సూచించారు.

పలువురిపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ, సంతసీతారాంపురం గ్రామాలకు చెందిన పలువురిపై పోలీసులు ముందుస్తుగా శనివారం కేసులు నమోదు చేశారు. సంతసీతారంపురంలో గాలి వెంకటరెడ్డి, చిన్నారెడ్డి, పొన్నాడలో సాధు మూసలయ్య, నేతింటి నీలమప్పడుపై 151 సీఆర్‌పీ సెక్షన్ నమోదు చేశారు. ఈ నెల నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా పూర్తిచేయడమే లక్ష్యమని ఎస్సై చెప్పారు. వీరికి స్టేషన్ బెయిల్ మంజూరు చేసినట్లు ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు.

ఘనంగా ఆర్మీ రైజింగ్ డే


కార్యక్రమంలో పాల్గొన్న సైనికులు, కుటుంబ సభ్యులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని పెద్దమురహరిపురంలో శనివారం భారత ఆర్మీ రైజింగ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సైనిక సేవాసమితి అధ్యక్షుడు కె.దేవదాసు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ముందుగా సర్పంచ్ గౌరకల వసంతరావు చేతుల మీదుగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. భారత సైన్యం త్యాగాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం సైన్యంలో సుదీర్ఘ కాలం పాటు పని చేసి సుబేదార్(ఆర్డినరీ కెప్టెన్)గా ఇటీవల పదవీ విరమణ పొందిన కె.చలపతిరావు, శ్యామల కుమారి దంపతులను ఘనంగా సన్మానించారు. 30 ఏళ్ల పాటు వివిధ హోదాల్లో ఇండియన్ ఆర్మీలో పని చేసిన ఆయన మధుర నుంచి పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సైనిక సేవా సమితి గౌరవ అధ్యక్షుడు టి.మురళి, కోశాధికారి అర్జి రామారావు, గౌరక రామారావు, సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర కల్యాణం

టెక్కలి: స్థానిక పట్టుమహదేవి కోనేరు గట్టుపై వైభవ వేంకటేశ్వరాలయంలో శనివారం నేత్రపర్వంగా స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయం మండలాభిషేక మహోత్సవం సందర్భంగా అలివేలు మంగ పద్మావతి గోదా సమేత వైభవ వేంకటేశ్వరస్వామి కల్యాణం, కలశ స్నపనం, సర్వదర్శనాలతో పాటు విశేష నక్షత్ర హారతి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. అనంతరం అన్నమయ్య సంకీర్తనలు, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, పట్టణ వర్తక సంఘం అధ్యక్షుడు వారణాసి గోవిందరాజు, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చింతాడ మంజు, పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ పి.చంటి తదితరులు పాల్గొన్నారు.


స్వామివారి కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి పరేష్‌కుమార్

ఇచ్ఛాపురం: స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో శనివారం సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై జూనియర్ సివిల్ జడ్జి పి.పరేష్‌కుమార్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను ఇంటి వద్దనే వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందజేస్తే సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ చేయడం సులువుగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. రమేష్, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు రమణయ్య రెడ్డి, సభ్యులు దేవరాజ్, సీతయ్య, నాగరాజు పాత్రో, దక్కత కృష్ణమూర్తి, బైరి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీలు, ఊరేగింపులు నిషేధం

ఇచ్ఛాపురం రూరల్: జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న నేపథ్యంలో రాజకీయ పార్టీ నాయకులు, యువకుల ర్యాలీలు, ఊరేగింపులకు ఎటువంటి అనుమతి లేదని రూరల్ ఎస్‌ఐ ఎస్.లక్ష్మణ్ స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం మైక్ ద్వారా మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. అభ్యర్థులను విజేతలుగా ప్రకటించిన సందర్భంలో బాణసంచా పేల్చడం, సమావేశాలు నిర్వహించడం, సన్మాన, సత్కారాలు చేయడం, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలని కోరారు.


మైక్ ద్వారా హెచ్చరిస్తున్న ఎస్‌ఐ లక్ష్మణ్

తొలిరోజు హాజరు అంతంతమాత్రమే

శ్రీకాకుళం న్యూకాలనీ: 2024–25 కొత్త విద్యా సంవత్సరాన్ని జిల్లాలో జూనియర్ కాలేజీలు ప్రారంభించాయి. వేసవి సెలవుల అనంతరం శనివారం తొలిసారిగా తెరుచుకున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలు శత శాతం పనిచేశాయి. ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు హాజరయ్యారు. అభ్యర్థులు అంతంతమాత్రంగానే హాజరైనట్టు గణాంకాలు చెబుతున్నాయి. కొన్ని కాలేజీల్లో కనీసం పది మంది కూడా హాజరుకాలేదని తెలిసింది. గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీలకైతే కనీసం విద్యార్థులే రాలేదని అక్కడి సిబ్బంది చెబుతున్నారు. మరోవైపు అడ్మిషన్ డ్రైవ్, సప్లిమెంటరీ జవాబుపత్రాల ఆన్‌లైన్ మూల్యాంకనంపై సిబ్బంది దృష్టి పెట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ అందుబాటులో లేకపోవడంతో అక్కడి అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నట్టు అధికారులు గుర్తించారు. అందుకు ప్రత్యామ్నాయ ఆలోచనలు చేసే విధంగా ఇంటర్మీడియెట్ బోర్డు ఉన్నతాధికారులకు నివేదించేందుకు అధికారులు సిద్ధమౌతున్నట్టు తెలిసింది.

నేడు వేంకటేశ్వర ఆలయ వార్షికోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మొండేటివీధిలో వేంకటేశ్వర స్వామి ఆలయం వార్షిక ఉత్సవాలు ఈ నెల 2న నిర్వహించనున్నట్లు అర్చకులు, నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆదివారం ఉదయం స్వామివారికి అభిషేకాలు, సాయంత్రం కల్యాణ వేడుకలు నిర్వహిస్తారని తెలిపారు. భక్తులంతా పాల్గొనాలని కోరారు. కాగా, శనివారం ఆలయ అర్చకులు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తర శతనామాలచే భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణలు జరిగాయి. స్వామికి పూలు, తులసిమాలలతో అలంకరించారు.


మొండేటివీధిలోని వేంకటేశ్వరుడు

ప్రభుత్వ కళాశాలలోనే అత్యుత్తమ విద్య

రణస్థలం: ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన విద్యా బోధన సాధ్యమని రణస్థలం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.విజయలక్ష్మి అన్నారు. కొండములగాం గ్రామంలో ఇటీవల ఉత్తీర్ణులైన పదో తరగతి విద్యార్థులను కలిసి తమ కళాశాలలో చేరాలని కోరారు. తమ కళాశాలలో మంచి సిబ్బంది ఉన్నారన్నారు.